**కామెడీ కథ**

## మిట్టమధ్యాహ్నపు వేళ. పిట్టక్కూడా చెట్టొదిలి పెట్టి రావాలనిపించని వేళ. టెంపరేచర్‌తో పాటు టెంపర్లూ రెయిజయిపోయే వేళ.

**అలాంటివేళ జాన్సీ నిర్మానుష్యంగా ఉన్న రోడ్డుమీద నడుస్తోంది. మిర్రర్ వర్క్ చేసిన దుక్కలాంటి క్రేప్ చీర చూసేవాళ్ళ కళ్ళు చెదిరేలా మెరుస్తోంది. అంతకంటే దుక్కగా వుంది ఆమె ధరించిన జాకెట్టు. పైగా చిన్న కాలరు కూడా వుంది దానికి తమాషాగా.**

# జాన్ జాన్సీ జనార్దన్

పక్కనున్న చిన్న సందులో సైకిలాపి నిలబడి జాన్సీనే చూస్తున్నాడు జాన్. ఇంత మండుటెండలో దుక్కల్లాంటి ఆ చీరా జాకెట్టూ ఎలా వేసుకుందబ్బా ఉక్కపొయ్యదూ? అనుకున్నాడేమో.. అదేదో తేల్చుకుందాం అన్నట్టు సైకిలు పోనిచ్చి రోడ్డెక్కి జాన్సీ వెనకే నెమ్మదిగా తొక్కుకుంటూ కొంత దూరం పోయాడు. ఏదో నిర్ణయానికొచ్చిన వాడిలా ఉన్నట్టుండి సైకిలు స్పీడు పెంచి జాన్సీ ముందుకొచ్చి దారికడ్డంగా సైకిలాపాడు.

జాన్సీ కూడా ఆగక తప్పలేదు. తప్పించుకుని పక్కనించి పోదామని కదిలింది. ''మేడమ్ ప్లీజ్'' జాన్ పిలిచేసరికి నిలబడి చూసింది.

రోడ్డుమీద, పక్కసందుల్లోనూ ఎవ్వరూ లేరు.

''నేను సిఐడి ఇన్‌స్పెక్టర్ని. మఫ్టీలో ఉన్నానండి. ఈ కాలనీలో గొలుసులు కత్తిరించుకుపోయే దొంగల ముఠా తిరుగుతోందని మాకు న్యూసొచ్చింది. మేమిక్కడ నెట్టేసాం. అంటే వల పన్నాం. ఈ రోడ్డు, ఆ రెండు సందులూ నా ఇలాకా. మీరొక్కరూ ఒంటరిగా ఎల్తున్నారు కాబట్టి చెప్తున్నానండి. మీకు తెలీకుండా ఎనకమాల్నించొచ్చి క్షణంలో గొలుసు కత్తిరించుకు పోతారండి. అందుకని మీరు గొలుసులూ, గాజులూ, సెవి కమ్మలూ అన్నీ తీసి మీ బ్యాగులో ఏసి, బ్యాగుని భద్రంగా పట్టుకునెల్లిపోండి. ఇప్పుడిక్కడ నేను సాయం ఉండగానే గబగబా అన్నీ తీసి బ్యాగులో ఎట్టేసుకోండిమరి. ఏ సందులోంచి ఏ దొంగొడొత్తాడో చెప్పలేం గదా. తియ్యండి, బ్యాగులో ఏసేసుకోండి మరి'' అని తొందరపెట్టాడు.

జాన్సీ ఆలోచించింది. 'వీడి బొంద. ఆర్డినరీ బస్సుల్లో అడుక్కుతినేవోడిలా వున్నాడు. వీడేం సిఐడి? గొలుసుల్దొంగయ్యుంటాడు. కత్తిరించుకు లగెత్తితే ఒక గొలుసే దక్కుతుంది. అన్నీ బ్యాగులో వేయించి బ్యాగు లాక్కుంటే గాజులూ కమ్మలూ కూడా దక్కుతాయి. వీడి నాటకాలు నా దగ్గరా? వీడికో ఠస్సా వేద్దాం' అనుకుని నవ్వింది.

మండుటెండలో పండు మామిడిలా నవ్వింది. జాన్ కూడా నవ్వాడు వాడికున్న గారపళ్ళన్నీ ఇకిలించి.

''నాకేం ఫర్వాలేదు. అదే మా ఇల్లు. అడుగో మా అన్నయ్య నాకోసం చూస్తున్నాడు'' ఓ గుమ్మంలో నిలబడి అటు ఇటూ చూస్తున్నాయన్ని చూపించింది.

చటుక్కున తప్పుకుని దారిచ్చాడు జాన్. చకచకా నడిచి ఆ ఇంటిగేటు తీసింది. లోపలికెళ్ళి గేటు వేసేస్తూ జాన్‌కేసి చూసి, బాగా చీకేసిన బంగినపల్లి మామిడి టెంకలా వున్న వాడి తల మీద ఒక కిలో ఐసుగడ్డని సన్నగా కోరి మరీ దిమ్మరించినంత చల్లగా నవ్వింది. అదే నవ్వుని గుమ్మం దగ్గర నుంచున్న 'అన్నయ్య' మీద కూడా గుమ్మరించింది.

తలుపు వేసెయ్యబోతున్న 'అన్నయ్య' అనుమానంగా చూస్తూ ఆగాడు. గబగబా మెట్లెక్కి ''నేను వాషింగ్ పౌడర్లు సేల్ చేస్తానండీ. వాడెవడో వెంటబడ్డాడు. ప్లీజ్ సార్. ఒక్క నిముషం లోపల నిలబడి వాడెళ్ళిపోగానే వెళ్ళిపోతాను. ప్లీజ్ సార్'' కళ్ళల్లోంచి నీళ్ళు కూడా కాసిని ఒలకబోసింది.

''రండి'' లోపలికి పిలిచాడు అన్నయ్య. అన్నయ్య పేరు జనార్దన్. జనార్దన్ భార్య పది నిముషాల క్రితమే ఫోన్ చేసింది వాళ్ళ అక్క ఇంటి నుంచి ''సాయంత్రం వస్తాను. అప్పుడు నీళ్ళొస్తాయి. ఇంట్లో సర్ఫ్ అయిపోయింది. కాస్త తెచ్చిపడెయ్యండి. చింతపండు కూడా. నీళ్ళొస్తుండగా వాషింగ్ మెషీన్ వేసి ఈ రెండ్రోజుల బట్టలూ ఉతికేస్తా. పనిపిల్ల ఊరెళ్ళింది'' అంది.

పక్కసందులో కిరాణా కొట్టుకెడదాం అనుకుని తలుపు తీసాడు. ఎండ తీవ్రత భయపెట్టింది. ఇంత ఎండలో వెళ్ళాలా? అని ఆలోచిస్తుంటే జాన్సీ ప్రవేశించింది.

''వాషింగ్ మెషీన్ పౌడరంటే... సర్ఫుందా?''

''ఉంది సార్''

''కూచోండి''

''ఇదుగో సార్. ఈ ప్యాకెట్టు షాపులో నలభై ఐదు. నేను ముప్పైకే ఇస్తాను. ఇది మీకు తొంభైకి దొరుకుతుంది. నేను డెబ్బైకే ఇస్తా''

'ఈవిడకి ఒత్తులు పలకవు. కర్ణకఠోరంగా వుంది. ఒక్క అంకెకి కూడా ఒత్తులు పలకలేదు' ఇరిటేటవుతూ విన్నాడు జనార్దన్.

''డెబ్భై. డెబ్భై రూపాయల ప్యాకెట్టే ఇవ్వండి'' అన్నాడు ఒత్తుని మరీ వత్తి పలుకుతూ.

జాన్సీ కుర్చీలో సెటిలై కాళ్ళ దగ్గర సంచీ పెట్టుకుని సర్ఫు ప్యాకెట్ తీసి ఇచ్చింది.


''చింతపండుందా?'' అడిగి నాలిక్కరుచుకున్నాడు జనార్దన్.

''సారీ సార్. లేదు'' మామిడి రసంలో ఐస్ ముక్కలేసి గిలకొట్టినంత తియ్యగా చల్లగా నవ్వింది.

జనార్దన్ కూడా నవ్వాడు. ''డబ్బు తెస్తానుండండి'' లోపలకెళ్ళారు.

జాన్సీ సంచీ సద్దుకోడానికన్నట్టు ప్యాకెట్లు తీసి బల్లమీద పెట్టి అడుగునేదో సర్ది మళ్ళీ ప్యాకెట్లు సంచీలో పెట్టింది. ప్యాకెట్లతోపాటు బల్లమీది వాచీ, ఉంగరం సంచీలోకి మాయమయ్యాయని కేలండర్లోంచి గాంధీగారు చూసారుగానీ ఏం మాట్లాడలేకపోయారు.

ఇందాక గుమ్మంలోకి రాగానే అసలు జాక్‌పాట్ ఎక్కడుందో కనిపెట్టేసింది జాన్సీ. గాజు తలుపుల షోకేసులో బొమ్మలు చూస్తున్నట్టు నిలబడింది. షోకేసులో ఒక అరలో ఓ మూల మూడు వెండి కుంకుమభరిణలు, ఒక సన్న గొలుసు 'ఎవరు చూడొచ్చారులే' అన్నట్టు పడున్నాయ్. జనార్దన్ వెళ్ళిన గది గుమ్మం వైపే కన్నార్పకుండా చూస్తూ మూడూ ప్లేస్ ఒకటి లాగేసి కాలర్ జాకెట్‌లోకి మాయం చేసేసింది. వాటి ప్లేసులోకి రంగు రంగుల రామ పట్టాభిషేకం బొమ్మ జరిపి దానివైపే ఆరాధనగా చూస్తూ నిలబడింది జనార్దన్ వచ్చేసరికి.



''ఈ బొమ్మలన్నీ చాలా బావున్నాయి సార్'' అభినందిస్తూ వంద నోటందుకుని ఎడం చేత్తో రెడీగా పట్టుకున్న మూడు పదులూ ఇచ్చేసింది.

''థాంక్యూ సార్. వెళ్ళొస్తానండి. వాడెళ్ళి పోయాడ్లెండి'' నమస్కారం పెట్టింది.

ఫోను గణగణ మోగుతుంటే దానివైపు వెళ్ళాడు జనార్దన్. చకచకా నడిచి రోడ్డుమీదకొచ్చింది జాన్సీ.ఎడంవైపు చిన్న సందులోకి తిరిగింది. యధాప్రకారం ఎవరూ లేరు. ఓ గోడ చాటుకెళ్ళి జీన్సు, టీషర్టుమీద కట్టిన చీరని సర్రున లాగి విప్పేసి సంచీలో కుక్కేసింది. నెత్తిమీద బుద్ధుడి కొప్పులాంటి విగ్గుని కూడా లాగేసి సంచీలో కుక్కింది. సంచీలోంచి ఓ పెద్ద తెల్ల సంచిని లాగి సరుకులతో నిండిన ఈ నల్ల సంచిని ఆ తెల్ల సంచిలో పెట్టింది.

ఎర్ర టీ షర్టు, నీలం జీన్స్, బోయ్‌కట్, గాగుల్స్‌తో గ్లామరస్‌గా రోడ్డెక్కింది. జనార్దన్ ఇంటి గేటు ముందు నుంచుని జాన్‌తో ఏదో మాట్లాడుతున్నాడు. వాళ్ళిద్దర్నీ చూస్తుంటే జాన్సీకి భలే నవ్వొచ్చింది. ఇట్నించెళ్ళిపోదాం అనుకున్నది కాస్తా మళ్ళీ అటే నడిచింది.

అనుభవం లేని చిన్న వయసు కదా చిలిపి ఊహ ఆపుకోలేక వాళ్ళిద్దరి వైపూ నడిచింది.

''మేడమ్! మీరట్నుంచే ఒత్తన్నారు కదా. ఆ పక్కనెవరైనా అద్దాలద్దాల సీరకట్టినావిడ పోతోందా చెప్పండి'' జాన్ అడిగాడు.

జనార్దన్ ఆమెనీ ఆమె టీషర్టునీ నిశితంగా చూస్తున్నాడు.

జాన్సీ కంగారుపడింది. 'ఈ ఎదవగానీ నన్ను గుర్తుపట్టాడా? ఏడిసాడు. జుట్టూ చీరకట్టూ లేవుగా?'

''ఆవిడెవరో మరి ఈనగారింట్లో దొంగతనం సేసిందట. ఆవిడతో నాకేదో సమ్మందం ఉందని నా గురించి పోలీసులకి ఫోను సేసేసానని అంటున్నాడీయన. ఫోనుగొడ్తే పోలీసులొత్తారా? ఈన ఎర్రిగానీ, అయినా నేనేటి సేసాను? రానీ ఎవురొత్తారో'' అంటున్నాడు జాన్.

జనార్దన్ జాన్ చేతిని గట్టిగా పట్టుకున్నాడు. ఒదిలించుకోబోతే మెలి తిప్పాడు. ఇంకో ఠస్సా వెయ్యాలని సరదా ఏసింది జాన్సీ మనసులో.

''యస్.. యస్. నో ఫైటింగ్. ఆల్ రైట్. ప్రాబ్లెమ్ వాట్? ఐ టూ టౌన్ ఎస్సై'' తను రాల్చిన బొట్లేరు ముక్కలు విని అదిరిపోయి అటెన్షన్‌లోకొచ్చి సెల్యూట్ కొడతారనుకుంది.

జుయ్‌మంటూ పోలీస్ జీపొచ్చి ఆగింది. ఆడా మగా కానిస్టేబుల్స్ దిగారు. జనార్దన్‌కి సెల్యూట్ కొట్టారు. జాన్‌నీ, జాన్సీని తోసుకుంటూ జీపెక్కించారు.

★ ★ ★

పోలీస్ స్టేషన్‌లో పోలీసులు పొట్టచెక్కలయ్యేలా నవ్వుకుంటున్నారు.

''ఆడు సియ్యైడీ అంట. దాన్దగ్గర గొలుసూ, గాజులూ కొట్టేద్దారనుకున్నాడు. ఇది ఎస్సైయంట. మనెస్సైగారింట్లోనే దొంగతనం చేసింది. మనం జీపేసుకెళ్ళీ వాళ్ళనట్టుకొచ్చి చెరో బొక్కలో తోశాం'' వాళ్ళకి ఎంత నవ్వినా నవ్వాగట్లేదు.

'ఒకసారి ఠస్సా వేసిన వాడికే మళ్ళీ వెంటనే జెల్ల కొట్టాలని చూడ్డం వల్ల మనకే నష్టం' అన్న నీతి నేర్చుకుంది జాన్సీ చాలా ఆలస్యంగా.

'దొంగా దొంగా రాసుకుంటే నేల్లోంచి పోలీసు లుట్టుకొత్తారు' అనుకున్నాడు జాన్ ఫిలసాఫికల్‌గా.

✤

**పోడూరి కృష్ణకుమారి**